# ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

- పక్కా కార్యాచరణతో ఏర్పాట్లు చేయాలి
- కోడ్ ఉల్లంఘనులపై సత్వరమే స్పందించాలి
- కలెక్టర్, ఎస్పీతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, డీజీపీ అంజనీకుమార్




వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్,సీపీ

సిద్దిపేటరూరల్/మెదక్ అర్బన్/ అక్టోబర్ 21: ఉమ్మడి మెదక్ జిల్లాల్లో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పక్కా కార్యాచరణ రూపొందించుకుని ముందుకుసాగాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, డీజీపీ అంజనీకుమార్ తెలిపారు. శనివారం రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులతో కలిసి తెలంగాణ శాసన సభకు జరగబోయే సాధారణ ఎన్నికల ఏర్పాట్లుపై వీడియో కాన్ఫరెన్స్‌లో ఉమ్మడి మెదక్ జిల్లాల కలెక్టర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ జిల్లాల్లో ఎన్నికల ప్రవర్తనా నియామవళి ఉల్లంఘనులపై వచ్చే ఫిర్యాదులను త్వరతగతిన పరిష్కరించాలని సూచించారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల నుంచి వచ్చే ఫిర్యాదులకు తప్పనిసరిగా 24 గంటల వ్యవధిలో తీసుకున్న చర్యలపై లిఖిత పూర్వక సమాధానం ఇవ్వాలన్నారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించి సమావేశాలు, సభలు నిర్వహించుకునేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థుల నుంచి సువిధా యాప్ ద్వారా లేదా ఆఫ్ లైన్‌లో వచ్చే దరఖాస్తులకు ఎప్పటికప్పుడు సకాలంలో అనుమతి మంజూరు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో జరిగే ఎన్నికల ప్రచారంలో వినియోగించే ఆడియో, వీడియోలను పరిశీలించి ధ్రువీకరించాలన్నారు. సువిధా యాప్, ఆఫ్‌లైన్ దరఖాస్తులపై ఎన్నికల అధికారి దృష్టి సారించాలన్నారు. ఎన్నికల సమయంలో నిర్వహించే తనిఖీల్లో నగదు, బంగారం సీజ్ చేసే సమయంలో పాటించాల్సిన నిబంధనలపై క్షేత్రస్థాయి అధికారులకు అవగాహన కల్పించాలన్నారు. నగదు సీజ్ చేసే సమయంలో సంబంధిత వ్యక్తులకు సీజ్ చేస్తున్న నగదు, బంగారం వివరాలు, ఎక్కడ అప్పీల్ చేయాల్సి ఉంటుంది అనే అంశాలు తెలియజేసి, పట్టుకున్న వాటికి రసీదు ఇవ్వాలన్నారు. సీజ్ చేసిన బంగారం, నగదు రూ.10 లక్షల కంటే తక్కువైతే వెంటనే జిల్లాస్థాయిలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌సెల్‌కు, రూ.10 లక్షల కంటే ఎక్కువైతే ఐటీ అధికారులకు అప్పగించాలన్నారు. నగదుపై వచ్చే అప్పీళ్లను సంబంధిత గ్రీవెన్స్ సెల్ లేదా ఐటీ అధికారులు పరిశీలించి నిబంధనలు, ఆధారాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఎన్నికల సమయంలో సీజ్ చేసే నగదు, బంగారం, మద్యం, విలువైన ఆభరణాల విషయాన్ని మీడియాకు సమాచారం అందించాలన్నారు. అప్పీల్ అనంతరం విడుదల చేసే నగదు, బంగారం వివరాలు తెలుపాలన్నారు. జిల్లాల్లో ఓటరు స్లిప్పులు త్వరగా ముద్రించి, పంపిణీ చేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో ఎన్నికల నిర్వహణపై వస్తున్న వదంతులు, అపోహలను నివృత్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తక్కువ పోలింగ్ నమోదైన పోలింగ్ కేంద్రాలపై అధిక దృష్టి సారించి పోలింగ్ శాతం పెరిగేలా అవగాహన కల్పించాలన్నారు. డీజీపీ అంజనీకుమార్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు రాష్ట్రానికి చేరుకున్న కేంద్ర బలగాలను ఉపయోగించుకోవాలన్నారు. ప్రజలకు ధైర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రం నుంచి వచ్చిన బలగాలు ఎన్నికలు పూర్తయ్యేంత వరకు విధులు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని సూచించారు. సిద్దిపేట సమావేశంలో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, సీపీ శ్వేత, డీఆర్ఓ నాగరాజమ్మ, డీపీఆర్ఓ రవికుమార్, మెదక్ జిల్లాలో సమీక్షా సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి రాజర్షి షా, ఎస్పీ రోహిణి ప్రియదర్శిని, సంబధిత అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మెదక్ ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

# మరో 8 రోజులే..!

- ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తులకు అవకాశం
- ఇప్పటికే ఓటరు తుది జాబితా విడుదల
- జిల్లాలో మొత్తం ఓటర్లు 4,34,900 మంది




మెదక్, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ): కొత్తగా ఓటరు నమోదుకు కేంద్ర ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. ఈ నెల 4న ఓటరు జాబితాను ప్రకటించారు. 9న అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. షెడ్యూల్ వచ్చినా కొత్త ఓటరు నమోదుకు చివరిగా ఈ నెల 30వ తేదీ వరకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఫారం–6 ద్వారా కొత్త ఓటర్లు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. నవంబర్ 30న తెలంగాణలో ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే యంత్రాంగం సెప్టెంబర్ 19 వరకు ఓటరు నమోదు, మార్పులు చేర్పులకు అవకాశమిచ్చింది. ఆ దరఖాస్తులు అన్నింటినీ పరిగణనలోకి తీసుకుని అక్టోబర్ 4న తుది ఓటరు జాబితాను విడుదల చేసింది. ఈ గడువులో కొత్తగా ఓటరుగా నమోదయ్యేందుకు మాత్రమే అవకాశం కల్పించింది. ఫారం 7, 8 ద్వారా మార్పులు, చేర్పులకు అవకాశం ఇవ్వలేదు. ఫారం–6తో ఆన్‌లైన్‌లోగానీ, నేరుగా బూత్ లెవల్ అధికారుల ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపింది. అక్టోబర్ 4న విడుదలైన ఓటరు జాబితా పోలింగ్ కేంద్రాల వారీగా ఉండగా, ఇప్పుడు కొత్తగా నమోదయ్యే వారి లిస్టు సప్లిమెంటుగా ప్రచురిస్తారని అధికార వర్గాలు తెలిపాయి. 2023 అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 ఏండ్లు నిండిన వారు ఈనెల 31వ తేదీ వరకు ఆధార్‌కార్డు, వయసు ధ్రువీకరణ పత్రం అందజేస్తే మరో నెలలో జరిగే అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకునే సువర్ణావకాశాన్ని పొందుతారు.

***ఇంకా 8 రోజుల గడువే..***

జిల్లాలో ఓటర్ల నమోదుకు కేవలం 8 రోజులు గడువు మాత్రమే మిగిలింది. ఈ నెల 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. ఎన్నికలు జరిగే ప్రతిసారి ఓటు శాతం పెంచడం కోసం సంబంధిత అధికారులు ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. ఇందులో భాగంగానే ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు అవకాశం కల్పిస్తుంటారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ఓటు వజ్రాయుధంతో సమానమని, 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని విస్తృతంగా ప్రచారం చేస్తుంటారు.

***ఓటు వినియోగంపై విస్తృత ప్రచారం***

అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 30న జరగనున్నందున ఎన్నికల కమిషన్ ఈ నెల 31వ తేదీ వరకు ఓటరు నమోదుకు అవకాశం ఇచ్చింది. ఈ అవకాశాన్ని 18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగం గురించి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. స్పెషల్ డ్రైవ్ సైతం నిర్వహించారు. స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు, యువజన సంఘాలను ఇందులో భాగస్వాములు చేశారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటును నమోదు చేశారు. ఇప్పటికే ఓటరు తుది జాబితాను విడుదల చేశారు. తెలంగాణలో ఎన్నికల కోడ్ ఈ నెల 9న అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. నవంబర్ 3 నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. నవంబర్ 30న ఎన్నికలు నిర్వహిస్తారు. ఓటు శాతం పెంపొందించేందుకు అధికారులు ఎన్నికల ప్రక్రియ ప్రారంభానికి నెల రోజుల ముందు వరకు గడువు ఇచ్చారు. అదీ ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

### జిల్లాలో ఓటర్ల సంఖ్య..

ఎన్నికల కమిషన్ ఇప్పటికే ఓటరు తుది జాబితాను ప్రకటించింది. తాజా సమాచారం ప్రకారం మెదక్ జిల్లాలో మొత్తం 4,34,900 మంది ఓటర్లున్నారు. ఇందులో పురుషులు 2,10,209 మంది, మహిళలు 2,24,680 మంది, ఇతరులు 11 మంది ఉన్నారు. ప్రస్తుతం ఓటరు నమోదుకు గడువు పెంచడంతో ఈ సంఖ్య మరింతగా పెరిగే అవకాశమున్నది. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే.. మెదక్ నియోజకవర్గంలో 2,14,118 మంది ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 1,02,359 మంది, మహిళలు 1,11,755 మంది, ట్రాన్స్‌జెండర్లు నలుగురు ఉన్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలో 2,20,782 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 1,07,850 మంది, మహిళలు 1,12,925 మంది, ట్రాన్స్ జెండర్లు ఏడుగురు ఉన్నారు. ఇప్పటికే ఓటరుగా నమోదైన వారు తమ ఓటు హక్కు ఉన్నదో లేదో జాబితా ద్వారా పరిశీలించుకోవచ్చన్నారు. ఓటరు జాబితాలో పేర్లు లేనివారు, కొత్త ఓటర్లు విధిగా పేర్లు నమోదు చేసుకోవాలని అధికార యంత్రాంగం సూచిస్తోంది.

## హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌ను సందర్శించిన ఎన్‌సీసీ క్యాడెట్లు

గజ్వేల్ అర్బన్, అక్టోబర్ 21: గజ్వేల్ ఎడ్యుకేషన్ హబ్‌లో కొనసాగుతున్న జాతీయ స్థాయి ఎన్‌సీసీ క్యాంపులో భాగంగా ఆ క్యాడెట్లు హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌ను శనివారం సందర్శించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్యాడెట్లకు ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లోని ఫైటర్ జెట్ ఎయిర్ క్రాఫ్ట్, హెచ్‌ఏఐ కిరణ్, మాక్ వన్, మాక్ టుల పనితీరు, చేతక్ హెలికాప్టర్ పనితీరును పరిశీలించడంతోపాటు మ్యూజియాన్ని సందర్శించారు. ఏటీసీ సెంటర్‌లో సిగ్నలింగ్ పని తీరును వైమానిక దళ అధికారులు క్యాడెట్లకు వివరించారని క్యాంపు పర్యటన అధికారి లెఫ్టినెంట్ కల్నల్ పినాకి తెలిపారు. క్యాంపులో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక, క్రీడా విభాగాల్లో గెలుపొందిన క్యాడెట్లకు గజ్వేల్ క్యాంపులో బహుమతులు అందజేశారు. ఇదే ఎడ్యుకేషన్ హబ్ ఆవరణలో సంగారెడ్డి బెటాలియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సంయుక్త ఎన్‌సీసీ శిబిరంలో క్యాడెట్లకు ఖోఖో, వాలీబాల్ పోటీలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించి విజేతలకు బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ పీఎస్ నందా బహుమతులు అందజేశారు. అనంతరం ఎన్‌సీసీ క్యాంపులోని వివిధ రాష్ట్రాలకు చెందిన క్యాడెట్లు, మహిళా అధికారులు, గజ్వేల్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో బతుకమ్మ సంబురాలు జరుపుకొన్నట్లు లెఫ్టినెంట్ భవానీ తెలిపారు.



ఆర్సీపురంలో పోలీసుల కవాతు

## ఆర్సీపురంలో కేంద్ర బలగాలతో కవాతు

రామచంద్రాపురం, అక్టోబర్ 21: ఆర్సీపురం, భారతీనగర్ డివిజన్లలో సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర ఆదేశాల మేరకు కేంద్ర బలగాలతో పోలీసులు శనివారం కవాతు నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆర్సీపురం పోలీస్‌స్టేషన్‌కు ప్రత్యేకంగా కేంద్ర బలగాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఏసీపీ నర్సింహరావు, ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి నేతృత్వంలో సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు కవాతును నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కుని వినియోగించుకునేందుకు ప్రజల్లో ధైర్యం నింపేందుకు, సమస్యాత్మక ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూస్తామన్నారు. ఆర్సీపురం పోలీస్ స్టేషన్‌కు సుమారుగా వంద మంది కేంద్ర బలగాలు వచ్చాయని, సమస్యాత్మక ప్రాంతాల్లో అధిక ఫోర్స్‌ను పెడుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు వెంకట్, నర్సింహ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ బోల్తాపడి..ముగ్గురు మృతి

- మూడు కుటుంబాల్లో అలుముకున్న విషాదఛాయలు
- సదాశివపేట మండలం కోల్కూర్ గ్రామంలో ఘటన

సంగారెడ్డి, అక్టోబరు 21: ట్రాక్టర్ పంక్చరై బోల్తాపడడంతో డ్రైవర్‌తోపాటు మరో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సదాశివపేట మండలం కోల్కూర్ గ్రామానికి చెందిన ఈటెల రాములు ట్రాక్టర్ మరమ్మతులు చేయించుకునేందుకు ఇద్దరితో కలిసి బయలుదేరారు. కొల్కూర్ గ్రామ శివారు దాటగానే ఒక్కసారిగా ట్రాక్టర్ స్టీరింగ్ రాడ్ ఊడిపోవడంతో అధిక లోడుతో ఉన్నా ట్రాక్టర్ పక్కనున్న వాగులో బోల్తా పడింది. బోల్తా పడడంతో ఈటెల రాములు అలియాస్ రామయ్య (45), మంగలి గోపాల్, పొట్టిపల్లి మల్లేశం(32) అక్కడికక్కడ మృతి చెందారు. స్థానికులు గుర్తించి సదాశివపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, గ్రామస్తుల సహకారంతో జేసీబీ తెచ్చి మృతదేహాలను బయటకు తీశారు. మృతదేహాలను శవ పరీక్షల నిమిత్తం పేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడికి చేరుకున్న మృతుల కుటుంబీకులు, గ్రామస్తులతో దవాఖానలో ఆహాకారాలు మిన్నంటాయి.. అనంతరం శవ పరీక్షలు పూర్తి చేసి మృతదేహాలను కుటుంబీలకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.